విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 08 మార్చి 2025 8 పేజీలు

సమానత్వంతోనే స్త్రీ సాధికారత

- కాగితాలకే పరిమితమైన బేటీ బచావో... బేటీ పడావో
- పెరిగిన గృహహింస

ఆకాశంలో సగం... అవనికి వరం ' క్షమయా ధరిత్రి"అనే కవి వర్ణన 'స్త్రీ' ఓరిమికి ఒక చిరు ప్రశంస. ఇంతులను వర్ణించడానికి కవుల కలాలు, గాయకుల గళాలు సరిపోవు. మగువల శక్తియుక్తులు మహత్తరమైనవి. ఏ రంగంలోనైనా రాణించగల నేర్పరితనం నెలతకు వరం. అతివలను కీర్తించడంలోనే కాకుండా,నేటి ప్రపంచంలో స్త్రీ వ్యక్తిత్వానికి విలువనిచ్చి, సాధికారతవైపు నడిపిస్తే ప్రపంచ ప్రగతికి వాయు మనోవేగంతో దశదిశలా విస్తరిస్తుంది. సమానత్వ సాధనకు అవసరమైన విధానాలను అమలు చేయకుండా సుస్థిర లక్ష్యం సాధ్యం కాదు. 2047 నాటికి వికసిక భారత్ కల సాకారం చేయగలమా అనే ప్రశ్న అందరి మదిలోను తలెత్తుతుంది.

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు : మనిషి జీవితం జగత్తులో అత్యంత విశిష్టమైనది. ఒకే జాతిలో లింగ వివక్షత పేరుతో పనిచేత విధానాలు,వికృత రూపం ధరించడం,అతివను అబలగా మార్చి ఒక అలంకార వస్తువులా తమ అవసరాలను తీర్చే యంత్రంలా మార్చడం ఆధునిక నాగరిక ప్రపంచంలో కొనసాగుతున్న అనాగరిక చర్యకు పరాకాష్ట. దేశంలో మహిళలకు తాము అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునే రాజకీయ నాయకులు పెద్ద పెద్ద పదవులు అనుభవిస్తూ కేవలం అలంకారప్రాయంగా ఉండే కొన్ని పదవులను మహిళలు కేటాయించడంతోనే మహిళా సాధికారత సాధ్యమా..? మహిళలను అన్ని రకాలుగా కించపరచి, హింసించి, అణగదొక్కుతున్న పైశాచిక విన్యాసం ప్రభలుతున్న నేపథ్యంలో మహిళల హక్కుల కోసం, సమానత్వం కోసం పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కాగితాలకే పరిమితమైన బేటీ బచావో... బేటీ పడావో

దేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ స్ఫూర్తి, సమానత్వ విలువలు మరుగున పడుతున్నాయి. బేటీ బచావో.. బేటీ పడావో వంటి నినాదాలు కేవలం కాగితాలపై మాత్రమే మిగిలిపోయాయి. మహిళలపై దాడులు, అత్యాచారాలు ▶మిగతా 2లో..

ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచాలి

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం ప్రతి ఏడాది పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని అప్పుడే పర్యావరణ పరిరక్షణ లక్ష్యం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, హార్టికల్చర్ క్షేత్ర స్థాయి అధికారులతో 2024-25 లక్ష్య సాధన, 2025-26 లక్ష్యాలు పై యూనిట్ ఇన్చార్జిల పనితీరు పై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రకృతి వ్యవ సాయ సాగు విస్తీర్ణం 30,641 మంది రైతులు సుమారు 46 వేల ఎకరాల లక్ష్యం నిర్దేశించగా 37,844 మంది రైతుల ద్వారా 44,200 ఎకరాల ▶మిగతా 2లో..

హైవే పై మాఫియా..చీకటి వ్యాపారాలకు తెర

- ఐరన్, సిమెంట్, ఆయిల్, తారు ఇలా ఏదైనా వదలని వైనం
- జాతీయ రహదారి వెంబడి దర్జాగా వెలసిన అనధికార ఆయిల్ స్థావరాలు
- అక్రమార్జనకు అడ్డగా 16 నంబరు జాతీయ రహదారి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : అక్రమార్జనకు 16వ నంబరు జాతీయ రహదారి అడ్డాగా మారింది. అక్రమ దారులు చీకటి వ్యాపారాలకు హైవేను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. దొడ్డి దారిన కొనుగోలు చేసిన ఇనుము, ఆయిల్, సిమెంట్, తారు ఇలా ఏదైనా సరే జాతీయ రహదారిపై రవాణా జరిగే వాహనాల నుంచి డ్రైవర్లకు ఆశ చూపి అక్రమ కొనుగోలు చేస్తూ జేబులు నింపు కొంటున్నారు. వైజాగ్ నుంచి విజయవాడ, హైదరాబాద్, చెన్నైకు ఇదే ప్రధాన జాతీయ రహదారి కావడంతో, రోజు వేలాది వాహనాలు ఎగుమతులు, దిగుమతులతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిని ఆసరాగా తీసుకుని అక్రమ వ్యాపారులు ఆదాయ వనరుగా మలుచుకుంటున్నారు.

డ్రైవర్లకు ఆశ చూపి : కలకత్తా, ఒడిస్సా విశాఖ నుండి నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి వేలాది టన్నుల ఇనుము, హెచ్పీసీఎల్, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీల నుంచి డీజిల్, పెట్రోల్ ఎగుమతులు అవుతుంటాయి. లారీల నుంచి దొంగిలించిన ఇనుప ఊచలు, సిమెంట్, ఆయిల్, తారు దొడ్డిదారిన నల్ల బజారుకు చేరుతున్నాయి. అక్రమ వ్యాపారులు కొందరు డ్రైవర్లకు డబ్బు ఆశ చూపించి, లోబర్చుకుంటూ ఆయిల్, ఇనుము చోరీకి పాల్పడు తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్థావరాలు కూడా

ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో అక్రమాలకు పాల్పడుతున్నారు. లోడు లారీల నుంచి తస్కరించిన ఇనుము, సిమెంట్, ఆయిల్ను మార్కెట్ ధరలో 50 శాతాన్ని డ్రైవర్లకు ముట్టజెప్పుతున్నారు. ఇలా సేకరించిన వాటిని, ఇతర ప్రాంతాలకు తరలించి బహిరంగ మార్కెట్లో రూపాయికి 10 రూపాయలు లాభంతో సొమ్ము చేసుకుంటున్నారు.

పుట్ట గొడుగుల్లా హైవేలపై పుట్టుకొస్తున్న ఆయిల్ మాఫియా : ప్రైవేట్ కంపెనీల ▶మిగతా 2లో..

చేను కాదు చెరువే!

కాలుష్యమయమైన మంచినీటి చెరువులు

విశాలాంధ్ర - పెనుమంత్ర: తూడు, నాచు, గుర్రపు డెక్క, గడ్డితో అధ్వానంగా మారాయి మండలంలో గ్రామాల్లోని త్రాగునీటి చెరువులు. సత్యవరం నడి బొడ్డున ఉన్న చెరువు చేను వలే దర్శనమిస్తున్నది. చాలాకాలంగా చెరువులోని నాచు, పచ్చగడ్డి, తూడు, గుర్రపు డెక్క తొలగించ డానికి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం వాటి తొలగింపు భారంగా మారింది. పంచాయతీ నిధులు కేటాయించకపోవడంతో పాటు గ్రామ పాలకవర్గం గానీ, గ్రామ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో నేడు సమస్య జటిలంగా మారింది. పెనుమంత్ర మండలంలోని సత్యవరం, మాముడూరు, నెలమూరు ఆయా గ్రామాల్లో చెరువులకు ఎక్కువగా గోదావరి జలాలతో నింపి శుద్ధి చేసి త్రాగునీరుగా అందిస్తున్నారు. చాలా కాలంగా చెరువును శుభ్రం చేయకపోవ డంతో చెరువులలో నీరు దుర్వాసన వస్తున్నది. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే

త్రాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియదు. గ్రామ ప్రజలకు, పశువులకు దాహార్తిని తీర్చేందుకు ఈ చెరువుల నీరు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఏనాడు మంచి నీటి చెరువులను ఈ పరిస్థితుల్లో చూడలేదని చెరువు నీరు ఎంతో తియ్యగా అమృతతుల్యంగా ఉండేదని ▶మిగతా 2లో..

ఉత్సాహంగా 2 కె మారథాన్

పాల్గొన్న కలెక్టర్, జేసీ

విశాలాంధ్ర-ఏలూరు: ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, బాలికల హక్కులను రక్షించే లక్ష్యంగా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించు కుంటు న్నామని కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025 కార్యక్ర మాల్లో భాగంగా శుక్రవారం ఏలూరులో నిర్వహించిన 2 కె మారథాన్ను కలెక్టర్ కె. వెట్రిసెల్వి జెండాఊపి ప్రారంభించారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకు ఉత్సాహ పూరిత వాతావరణంలో సాగిన 2 కె మారథాన్లో ▶మిగతా 2లో..

పి-4 సర్వేను విజయవంతంగా నిర్వహించండి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఈనెల 8నుంచి చేపట్టే పి-4 సర్వేను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో పి-4 సర్వే, ఎంఎస్ఎంఇ సర్వే,వర్క్ ఫ్రమ్ హెూమ్ సర్వేపై ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మండల సచివాలయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి-4 సర్వే నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్,ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్(పి-4) సర్వే కు కార్యాచరణ రూపొందించిందన్నారు. జిల్లాలో ఈనెల 8వ తేదీ నుండి గ్రామ,వార్డు, సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే నిర్వహించి ఈనెల 16వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. అనంతరం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జెడ్పి సిఇఓ. కె. సుబ్బారావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, సిపిఓ వాసుదేవరావు పి-4 సర్వే నిర్వహణ తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

మెగా డి.ఎస్.సి -2025 కు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, బి.సి.సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మెగా డి.ఎస్.సి -2025 పరీక్షలకు టెట్ లో అర్హత సాధించిన బి. సి,ఇ.డబ్ల్యు.ఎస్ (ఇ.బి.సి) అభ్యర్థులకు ఆన్ లైన్ లో ఉచిత శిక్షణ కొరకు ఈనెల 10వ తేదీ నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా బి.సి. సంక్షేమం, సాధికారిత అధికారి ఆర్.వి. నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వారి 10 వ తరగతి, ఇంటర్,డిగ్రీ, టిటిసి,కుల, ఆదాయ నివాస ధృవ పత్ర ములు, ఆధర్ కార్డ్,2- పాస్ పోర్ట్ సైజ్ ఫోటోస్,టెట్ లో అర్హత సాదించిన మార్కుల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకొనవలెను. పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు పోస్ట్ ద్వారా,లేదా స్వయముగా జిల్లా బి.సి. సంక్షేమం, సాదికారిత అధికారి, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరు వారి కార్యాలయములో గడువులోగా సమర్పించాలన్నారు. వివరములకు ఫోన్: 8686180018 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

మారథాన్ (1వ పేజీ తరువాయి)

పాల్గొన్న కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఎస్పి శ్రావణ కుమార్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి. సాల్మన్ రాజు, సెట్ వెల్ సిఇఓ ప్రభాకరరావు, ఐసిడిఎస్ పిడి పి.శారద, డిసిహెచ్ఓ డా. సూర్యచక్రవేణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి. శ్రీలక్ష్మి, డిఇఓ వెంకటలక్ష్మమ్మలతో పాటు పెద్దఎత్తున వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యో గులు, మహిళలు,బాల బాలికలు, క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన సర్. సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందరికీ హక్కులు, సమానత్వం, మహిళా సాధికారతపై చైతన్య పరచడం ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మహిళా అభివృద్ధికి పూర్తిసహకారం అందించాల న్నారు. ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమన్నారు.మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల విజయాలు గుర్తించి వారిని సత్కరించనున్నట్లు తెలిపారు.

చెరువే (1వ పేజీ తరువాయి)

గ్రామంలోని ప్రజలు ఈ నీటితో తమ అవసరాలు తీర్చుకునేవారు కానీ నేడు కాళ్ళు కడుక్కోవడానికి కూడా పనికిరాని విధంగా నీళ్ళు మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. సత్యవరం, మాముడూరు, నెలమూరు గ్రామాల చెరువుల్లో అయితే ప్లాస్టిక్ వ్యర్థాలు మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. త్రాగునీటి చెరువు కాలుష్య కాసారాలుగా మారాయని ఈ గ్రామాల్లోని పెద్దలు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని వారు దృష్టి పెడితే ఈ విధంగా చెరువులు మారేవి కాదని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారాలకు తెర

(1వ పేజీ తరువాయి)

సొత్తును దర్జాగా దోచేస్తున్నారు. తమ వ్యాపారాలకు సౌకర్యంగా ఉండేలా హైవేల వెంబడి స్థావరాలు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా..కింది నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకూ కిమ్మనకపోవడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది.

విచ్చలవిడిగా స్థావరాలు ఏర్పాటు : మండలంలో ప్రత్తిపాడు, ధర్మవరం, చందుర్తి, వజ్రకూటం కత్తిపూడి, సీతంపేట, తమ్మయ్యపేట, బెండపూడి, తేటగుంట, గవరయ్య కోనేరు సమీపాల్లో వారి స్థావరాలు కొనసాగుతున్నాయి. ఈ స్థావరాల వద్ద చోరికి ఎప్పుడు తమ మనుషులు ఉండే విధంగా అక్రమార్కులు ఏర్పాట్లు చేసుకున్నారు. హైవేపై ఈ అక్రమ వ్యాపారానికి స్థావరం ఏర్పాటు చేయడంతో పాటు పచ్చ పరదాలు కట్టి రహదారి పక్కన ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేశారు. హైవే పక్కన ఈ మాఫియా ఆయిల్ ఒక్కటే లారీల నుంచి కొంటుందంటే ఆశ్చర్య పోవాల్సిందే. ఆయిల్ మాటున నల్ల బజారుకు సిమెంట్, ఐరన్, తారు కొనుగోలు చేస్తున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి ఉన్నతాధికారుల వరకు తెలిసే హైవేపై చీకటి వ్యాపారాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ, చీకటి వ్యాపారాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విస్తీర్ణం పెంచాలి

(1వ పేజీ తరువాయి)

సాగువిస్తీర్ణం చేసినట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ఆర్థిక సంవత్సరం వరకూ ఎంత విస్తీర్ణం పెంచ గలిగారో అన్న విషయం ద్వారా మాత్రమే ప్రకృతి వ్యవసాయ దిశగా అడుగులు వేశారో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ కు మళ్ళడం వల్ల రైతులకి కలిగే ప్రయోజనాలు, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు ద్వారా అందచేస్తున్న చేయూత పై రైతులకి అవగాహన కల్పించడం లో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. రాబోయే సమావేశం నాటికి ఖరీఫ్ , రబీ 2025-26 ఈ క్రాప్ డేటా వివరాలు ఎంత మేరకు కన్వర్షన్ చెయడం పై నివేదికలో పేర్కొనాలని ఆదేశించారు. నవధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచడం పై దృష్టి పెట్టడం ద్వారా ప్రకృతి వ్యవసాయ సాగు పెంచడం సాధ్యం అవుతుందని కలక్టర్ తెలియ చేశారు. రానున్న 2025-26కి హార్టికల్చర్ సాగు విస్తీర్ణం పెంచడం పై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. హార్టికల్చర్ – జిల్లా సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు ఏకతాటి పై కలిసి పనిచేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు 30,641 మంది రైతులకి 45,961 ఎకరాలకు గానూ, 37,844 మంది రైతులు 44,219 ఎకరాలు సాధించడం జరిగిందన్నారు. ప్రీ-మాన్‌సూన్ డ్రై సోవింగ్ కింద 47,600 ఎకరాలు లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి బి సుజాత కుమారి, డిపిఎమ్ బి. తాతా రావు, అదనపు డిపిఎమ్ ఎండీ వలి , వ్యవసాయ సహాయ సంచాలకులు, ఇతర అనుబంధ క్షేత్ర స్థాయి అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారత

(1వ పేజీ తరువాయి)

పెరుగుతున్నా నిందితులను బహిరంగంగా సమర్ధించడం జరుగుతోంది. సనాతన ధర్మం పేరుతో మహిళలను రెండవ స్థాయి పౌరులుగా భావిస్తూ పురుషాధిపత్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. మోడీతో అంటకాగుతున్న కూటమి నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మూఢవిశ్వాసాలను ప్రోత్సహిస్తున్నారు.

పెరిగిన గృహహింస

ఇటీవల కాలంలో స్త్రీలపై ఆధిపత్యం కుటుంబ హింసను పెంచుతోంది. దీనికి తోడుగా రాజకీయ స్వార్థం కోసం మహిళలపై అసభ్య వ్యాఖ్యలు పెరిగాయి.మహిళల శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చడం, పోర్న్ వీడియోల వ్యాపారం వేగంగా పెరుగుతుంది. పురుష ఆధిపత్యాన్ని పెంచే సంస్కృతి ప్రమాదకరంగా విస్తరిస్తోంది. నూతనంగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో యువత తమ జీవిత భాగస్వామిని స్వేచ్ఛగా ఎంపిక చేసుకునే హక్కును హరించారు. చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు, నెలకు రూ.1500 వంటి హామీలు ఇచ్చిన వాటిపై స్పష్టత లేదు.

స్త్రీ పురుషులతోనే సమాజ వికాసం

కేవలం పురుషుల వలనే ప్రగతి సాధ్యపడదు. సమాజ వికాసానికి స్త్రీ పురుషులు ఇద్దరి సహకారం అవసరం.స్త్రీలను హింసించిన సమాజం అభివృద్ధి చెందదు. కష్టాలు, కన్నీళ్లు ,మానసిక స్పందనలు ఇరువురికి సమానం. ఇది మానవ లక్షణం. ఆడ,మగ అనే లింగ వివక్షతో స్త్రీని ఆర్థికంగా, సామాజికంగా, శారీరకంగా, మానసికంగా అణగదొక్కి వేధించడం అరాచక పర్వానికి పరాకాష్ట. లింగ భేదాన్ని బలాన్ని బట్టి సమాజంలో స్త్రీ పురుషుల స్థానం నిర్ణయించరాదు. ఆధికృత భావంతో,అరాచక వాదంతో మగువల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక స్వేచ్ఛ స్వాతంత్రాలను హరించడం పైశాచికత్వం. ఈ ఆధునిక కాలంలో మహిళలకు నిజమైన స్వేచ్ఛ లేకపోవడం శోచనీయం.

హక్కుల సాధన కోసం పోరాడాలి

స్త్రీలపై హింస, ఆర్థిక పరాధీనత, సామాజిక అసమానతలకు మూలం పురుషాధిక్యత. మనదేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు,మహిళల హక్కుల కోసం సవాలు చేసే స్థితి ప్రజలందరిలోనూ రావాలి. మహిళలు కనీసం సాధించిన హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా ముందుకు రావాలి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు లాభాల కోసం మహిళా హక్కులను తక్కువ చేయడాన్ని ప్రశ్నించే స్థాయికి ఎదగాలి.అణచివేతను ఎదుర్కొని అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాటాల స్ఫూర్తితో సమాన హక్కుల సాధన కోసం ఉద్యమాలతో ఉవ్వెత్తున కదలాలి. అప్పుడే మహిళా సాధికారక సాధ్యమవుతుంది.

రీసర్వే పూర్తి

విశాలాంధ్ర-లింగపాలెం: రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గణపవారిగూడెంలో సర్వే పూర్తి చేసినట్లు రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు తెలిపారు. గ్రామంలో ఉన్న 500 ఎకరాలలో ఈ సర్వే నిర్వహించామని అన్నారు. ఇద్దరు సర్వేయర్లు రెండు బృందాలుగా ఏర్పడి సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు. సర్వేకి సంబంధించి రికార్డులను పరిశీలించే ప్రక్రియ పూర్తయిందని డిప్యూటీ తహసిల్దార్ తెలిపారు. సర్వే చేసిన వివరాలను భూముల యజమానులకు తెలియజేశామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఈయన కోరారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోపు ఆ సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ తహసిల్దార్ పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన రాజమండ్రి ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్

విశాలాంధ్ర -చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జోన్ 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శోభారాణి సందర్శించారు. కళాశాల మౌలిక సదుపాయాలు, విద్యా సదుపాయాలు పరిశీలన చేసి అభినందిస్తూ తగు సూచనలు చేసారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బి గ్రేడ్ వచ్చినందుకు కళాశాల అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందిని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాసరావును అభినందించారు. నాక్ బృందం సందర్శన సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షించారు. అనంతరం కళాశాల సిబ్బంది సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ రాసిన ఖమ్మం జిల్లా ఆదివాసీ విజ్ఞానం అనే పుస్తకంను ఆవిష్కరించారు. అనంతరం కళాశాల సెంట్రల్ లైబ్రరీలో సోల్ సాఫ్ట్‌వేర్ ను ప్రారంభించారు. అనతరం కళాశాల లైబ్రేరియన్ ఎం.సుందర్ సోల్ సాఫ్ట్‌వేర్ స్టూడెంట్స్ స్టాఫ్ కు ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ సిబ్బంది కళాశాల కార్యాలయం ను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-కామవరపుకోట: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఆటలు,పాటల పోటీలు నిర్వహించి ఏపిఎం బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమానికి వైస్ ఎంపీపీ గిరిజ, పంచాయతీ సర్పంచ్ అనూష భాగ్యరాజు, సుశీల టీచర్ ని శాలువాలు పూల మాలతో సన్మానిం చారు. ఈ కార్యక్ర మంలో సిడి పిఓ బ్యూలా, సూపర్వైజర్స్ మంగా దేవి, వీర కుమారి పాల్గొన్నారు. ఎంఈఓ 2 ప్రశాంత్ కుమార్ మాట్లాడారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, వాడవల్లి గ్రామం కాపురస్తులు. ప్రస్తుతం విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నంలోని గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం గాంధీనగర్ డోర్ నెం: 58 – 28 – 2/8 ఇంటిలో నివాసం ఉంటున్న **గునుపూడి రామారావు** గారి కుమారుడు **గునుపూడి శంకర గంగరాజు**కు చెందిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. **వాడవల్లి గ్రామంలో రీ సర్వే నెం. 29 రులో య.0.30ట్లు, రీ సర్వే నెం.30రులో య.0.70ట్లు, రీ సర్వే నెం.299రులో య. 1.00ట్లు వెరసి య 2.00ట్ల దస్తావేజులు నంబర్ 2590 /2019** ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ ల నిమిత్తం వాడవల్లి నుండి ముదినేపల్లి మోటార్ బైక్ పై తీసుకువెళ్లి జిరాక్స్ షాపు వద్ద చూడగా మార్గం మధ్యలో పోయినట్లు గుర్తించాను. పరిసర ప్రాంతాల్లో, వస్తున్న రహదారిపై వెతికిన ఆచూకీ కనపడలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ సెల్ నెంబర్‌కు సమాచారం అందించగలరు. **9912703134**

అగ్ని ప్రమాద బాధితులకు లయన్స్ క్లబ్ నిత్యావసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర -ఉండి : మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు మానవత్వం చూపాలని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శుక్రవారం ఉండి పెదపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వస్వం కోల్పోయిన బురగ జ్యోతి, వెంకట రత్నం కుటుంబానికి ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నెలవారీ నిత్యావసర సరుకులు, కొంతనగదు అందించారు. ఈ కార్యక్రమానికి కీ.శే. పెన్మెత్స కృష్ణంరాజు కుమారుడు ఆంజనేయ రాజు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం నిజమైన మానవత్వం అనిపించుకుంటుంది అన్నారు. మాజీ క్లబ్ అధ్యక్షురాలు ముదునూరి విజయ, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు మాట్లాడుతూ ఇలాంటి సమయంలో మనోధైర్యం కోల్పోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పాలతీర్థపు నరసింగ్‌రావు, డిసి కన్నెగంటి రూత్‌కళ, భూపతిరాజు హరనాథ్‌రాజు పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థినీ విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెదేపా మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ ఆకాంక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో పదో తరగతి చదువుతున్న 61 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ఎంతో విలువైనదని, దానిని ఎంత ఎక్కువగా నేర్చుకుంటే అంత విలువను మనకు పెంచుతుందని పేర్కొన్నారు. ఇష్టంగా కష్టపడి చదువుల్లో రాణించాలని దాని వలన భవిష్యత్తులో భద్రత, భరోసా కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ భేతి శీను, మాజీ జెడ్పిటిసి శాఖమూరి సంజీవులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, తెదేపా మండల కార్యదర్శి కట్టం రాంబాబు, నాయకులు కొమ్మన వెంకటేశ్వరరావు, కరుటూరి కృష్ణ, కోటిపల్లి ముత్యాలరావు, చందా కనకరావు, పెంటారావు, సత్తిబాబు, పోసి, సలీం, కురిమెళ్ళ కృష్ణ, పాల్గొన్నారు.

మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరు

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగల సత్తా వారి సొంతమని కృష్ణ యూనివర్సిటీ డాక్టర్ ఎమ్మార్ ఏఆర్ కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. నవీన లావణ్యలత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పిజి సెంటర్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల శక్తిని ఎవరు తక్కువ అంచనా వేయకూడదు అన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని, మానవజాతి మనుగడకు మూలం స్త్రీ అన్నారు. మహిళలు మదర్ తెరిసా, సునీత విలియమ్స్, ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ప్రముఖులను ఆదర్శంగా తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ షేక్ అన్వర్ భాష, డాక్టర్ నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి

విశాలాంధ్ర-ఏలూరు: మహిళ రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని అవి పాలకులు పటిష్టంగా అమలు చేయాలని విశ్రాంతజడ్జి అడబాల లక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలు, చట్టాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో రోజురోజుకీ పెరుగుతున్న అశ్లీల సినిమాలు, అసభ్య ప్రకటనలు నియంత్రించడానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నేటి సమాజంలో మహిళలకు రక్షణ,భద్రత లభించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడుతూ దిశ, ఫోక్సో, గృహహింస నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం,కార్యాలయాలలో లైంగిక వేధింపులు నిషేధం లాంటి చట్టాలు ఉన్న మహిళలపై అఘాయిత్యాలను,యాసిడ్, లైంగిక దాడులను నిరోధించడంలో పాలకులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. మహిళలు సామాజిక దృక్పథం పట్ల అవగాహన కలిగి మహిళా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఆదిత్య కళాశాల లెక్చరర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందారని,దృఢ విశ్వాసంతో అనుకుంటే సాధించలేనిది ఏమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి .ఫణికుమార్, కోఆర్డినేటర్ సునీల్, పి. సౌభాగ్యలక్ష్మి, ఎస్ కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్‌బోర్డు అంశం అసెంబ్లీలో బొలిశెట్టి ప్రస్తావన హర్షణీయం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో పెండింగులో ఉన్న క్లయిముల విషయాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభలో లేవనెత్తడం పట్ల జిల్లా భవన నిర్మాణ కార్మికసంఘం ఏఐటీయూసీ హర్షం వ్యక్తం చేసింది. ఆ మేరకు జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, జిల్లా కార్యదర్శి పోలి రాతి ఆదినారాయణ, తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, వర్కింగ్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, కార్యదర్శి అత్తిలి బాబీ కోడే సాయి బాలాజీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసారు. వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ విషయంలో భవన నిర్మాణ కార్మికులలో నెలకొన్న ఆందోళనను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం శాసనసభ దృష్టిలో పెట్టడం హర్షణీయమని, ఆయన గత సమా వేశాల్లో కూడా ఈ విషయాన్ని ప్రస్తా వించారని, ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు కొయ్యలగూడెం ఎస్సై వి. చంద్రశేఖర్ తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గున్నేపల్లి నాగమణి ఆమె ఇంటి సమీ పంలో పోలవరం రోడ్డును దాటుతుండగా కన్నాపురం వైపు నుంచి వేగంగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో మహిళకు బలమైన గాయం అయ్యిందని ఆమెను కుటుంబ సభ్యులు రాజమండ్రి ప్రభుత్వాసు పత్రికి తీసుకెళ్లగా వైద్యులు అప్పటికే మరణించినట్లుగా తెలిపారని ఆయన అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సారా అనర్థాలపై అవగాహన

విశాలాంధ్ర-చింతలపూడి: నవోద యం 2.0లో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చింతలపూడి మండలం, నామవరం గ్రామంలో నాటు సారా వల్ల జరిగే అనర్థాలు గురించి గ్రామ సర్పంచి, ఎంపీటీసీల సమక్షంలో గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాటు సారా తయారీ,కలిగి ఉండుట, విక్రయించుట,రవాణా చేయుట, డ్రగ్స్, గంజాయి మొదలగునవి నేరములు అని తెలుపుతూ, అటు వంటి నేరములు చేయువారు ఎవరైనా గ్రామంలో ఉంటే వారి వివరములను వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కు, స్థానిక ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి సెల్ నెంబర్ 9440902428 తెలపాలన్నారు.

ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా Hon'ble the special Judge for speedy Trial of offences under protection of children for sexual offence act court విజయవాడ వారి SC No.68/2019, CR No.523/2014, U/S 12 of POCSO పటమట P.S. కేసులో ముద్దాయి అయిన పసుపులేటి పవన్ @ పండు, తండ్రి వెంకటేశ్వరరావు, వయస్సు 26సం॥లు, కాపు, పడమర స్ట్రీట్, గాంధీగ్రౌండ్స్, ఏలూరు అనువారు Hon'ble Court నందు వాయిదాలకు హాజరు అగుటకు విఫలం అయినందున సదరు ముద్దాయిని కోర్టువారు ప్రకటించబడిన నేరస్థుడిగా పరిగణించినారు. కావున నెలరోజుల లోపు కోర్టుకు గాని లేదా పటమట P.S.కు గాని లొంగిపోవలసిందిగా తెలియపర్చటమైనది. మరియు సదరు ముద్దాయి ఆచూకీ తెలిసిన వారు పటమట P.S. నందు SHO గారికి తెలియపరచవలసిందిగా కోరడమైనది.

Station House Officer
Patamata P.S.
Cell : 9440627036, 7794897770

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలి : సీపీఐ

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: వ్యవసాయానికి 9 గంటలు నిరంతర విద్యుత్ ఇవ్వాలని సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, బొప్పుడి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి విద్యుత్ అందించడంలో రోజుకు ఐదుసార్లు పైగా కోతలు విధిస్తున్నారన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని దిగుబడి తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం నిరంతరంగా విద్యుత్ సరఫరా అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పల్లగాని ఏడుకొండలు, నారగాని వెంకటేశ్వరరావు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆవిష్కరణలకు వేదిక టెక్నోవా-2025

విశాలాంధ్ర -భీమవరం: శ్రీవిష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న టెక్నోవా-2025 సాంకేతిక జాతీయ సదస్సు, 24వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ముగిసాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నై మోనేట్ సాఫ్ట్‌వేర్ సీనియర్ అసోసియేట్ డైరెక్టర్ పద్మ జయరామన్ మాట్లాడుతూ విద్యార్థినులు పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడంలో టెక్నోవా-2025 ఎంతో దోహదం చేసిందని వినూత్న, సృజనాత్మక సాంకేతిక ఆవిష్కరణలకు వేదికగా నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో సమాజ అవసరాలను తీర్చిదిద్దే ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. ఆడపిల్లలు స్వేచ్ఛగా ఎదగాలని, అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. టెక్నోవా -2025 లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు మెడల్స్, క్యాష్ ప్రైజ్, జ్ఞాపికను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థినిలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ప్రశంసలందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ పి.శ్రీనివాస రాజు, టెక్నోవా -2025 కన్వీనర్ డాక్టర్ పి.కిరణ్ శ్రీ, హెచ్ఓడిలు, పలు కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళామణులకు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: సహనానికి, శాంతికి సాధికారతకు మహిళలు స్ఫూర్తి అని, ప్రపంచంలో సగభాగానికి పైగా మహిళలే ఉన్నారని, ఎన్నోరంగాల్లో ముందుండి స్ఫూర్తిగా నిలుస్తున్నారని భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి పులపర్తి సత్యవాణి అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో కోపా కళ్యాణ మండపంలో ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో భీమవరం పట్టణంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 25 మంది మహిళా మూర్తులను సత్యవాణి సత్కరించారు. ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్ల ద్వారా ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నదని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు గంధం రమాదేవి, సభ్యులు అరేటీ రాణి, గంధం శ్రీదేవి, చీడే అమ్మాజీ జ్యోతి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ మహిళలు తమ శక్తిని తెలుసుకోవాలని, ప్రస్తుత ప్రపంచంలో తామేంటో నిరూపించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మహిళ సాధికారత ప్లాస్టిక్ నిషేధం పై ప్రతిజ్ఞ నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలలో ఉత్తమ సేవలు అందిస్తున్న 25 మంది మహిళలను సత్కరించామని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సమంతపూడి మణి, ఎండి షాహనాజ్, ఇందుకూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహిళలు...ఆదర్శప్రాయులు

లక్ష్యం ఉంటే సాధించలేనిదంటూ ఉండదు

విశాలాంధ్ర-లింగపాలెం: ఆడవాళ్లు అబలలు కాదు, లక్ష్యముంటే సాధించలేనిది ఉండదంటూ పలువురు మహిళలు నిరూపించి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలిచారు. కుటుంబంలో పేదరికం చవిచూసి భవిష్యత్తు తరాలకు ఇటువంటి బాధలు ఉండకూడదనే ఆలోచనతో కష్టాలను ఎదురొడ్డి... ఉన్నత స్థాయిలో నిలిచారు పలువురు మహిళలు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా లింగపాలెం మండలంలోని కొందరు మహిళల విజయాలు చూద్దాం. చిన్నతనంలో పడిన కష్టాలు, ఎదురైన అనుభవాలను పాఠంగా నేర్చుకుని తమకంటూ ఒక స్థాయిని నిలబెట్టుకొని భావితరాలకు మార్గాన్ని చూపుతున్నారు వీరు.

అమ్మకష్టం పాఠం నేర్పింది
లింగపాలెం ఎంపీడీవో కె. వాణి

అమ్మ,నాన్నలకు ముగ్గురు కూతుళ్లము. నిరక్షరాస్యతతో ఉన్న పేద కుటుంబం నుంచి పుట్టాం. నేను మూడో తరగతి చదువుతున్న సమయంలో నాన్న సూరినారాయణ గుండె పోటుతో హఠాన్మరణం పొందారు. అమ్మ గంగమ్మ పై కుటుంబ భారంపడింది. అమ్మ పడుతున్న కష్టం కన్నీళ్లు తెప్పించేది. నాకు అక్కచెల్లి ఉన్నారు. చిన్నప్పటినుంచి చదువుకోవాలన్న ఆశలకు అడ్డంకి ఏర్పడుతుందని భయపడ్డాను. అమ్మ అండగా నిలిచి చదివించింది. చదువుకుంటున్న సమయంలో జూనియర్ అసిస్టెంట్ గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరాను. ఉద్యోగంలో చేరి పైచదువులు చదవాలనే నా కోరికను నెరవేర్చుకున్నాను. ఉద్యోగం చేస్తూనే పీజీ చేశాను. పీజీ చేస్తూనే పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ టెస్టులు రాశాను. మండల పరిషత్తులో సూపరింటెండెంట్‌గా ఆతరువాత ఎంపీ డీవోగా ప్రమోషన్ వచ్చింది. నా చదువు,ఉద్యోగం అమ్మా, నాన్నలకు అంకితం.కష్టాలు వచ్చాయని బెదర కుండా ముందుకు సాగితే విజయాన్ని అందుకుంటాం.

పేదలకు వైద్యం అందించాలనే కల నెరవేరింది
డాక్టర్ యానే ప్రీతి

తన అమ్మమ్మ నర్సుగా పని చేస్తూ ఉండేది. అమ్మమ్మతో నాకు అనుబంధం ఎక్కువ. చిన్నప్పటి నుంచి అమ్మమ్మతో పాటు ఆసుపత్రికి వెళుతుండే దాన్ని. రోగులు పడే బాధ చిన్నప్పటి నుంచి నా మనసును కలచి వేసేది. డాక్టరై పేదలకు వైద్యం అందించాలని చిన్నప్పుడే అనిపించింది. దీంతో ఎంబిబిఎస్ చేసి కరోనా సమయంలో ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్‌గా వచ్చాను. దాదాపు నాలుగేళ్లపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా పనిచేశాను. డాక్టర్ గా నా సేవలు పేదలకు సరిపోవని భావించాను. గైనకాలజిస్ట్ చేయాలని దీనివల్ల గ్రామీణ ప్రాంతంలోని పేదలకు మరిన్ని వైద్య సేవలు అందించాలనే ఆలోచనను ఆచరణలో పెట్టాను. పీజీకి సెలెక్ట్ అయ్యి గైనకాలజిస్ట్ కోర్సులో చేరాను. ఈకోర్సు పూర్తయ్యాక గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ వైద్యశాలలో పని చేశాను. పేదలుగా ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు తాను వైద్య సేవలు అందించాలని భావిస్తున్నాను.

కష్టాలు ఎదుర్కొన్నా లక్ష్యాన్ని సాధించా
లింగపాలెం వెలుగు ఏపీఎం కే.జ్యోతి వెంకాయమ్మ

అమ్మ,నాన్నలకు నలుగురు సంతానం. నలుగురు కూతుళ్ళమే. తండ్రి రాములు మా చిన్నతనంలోనే మృతి చెందాడు. అమ్మ జానకమ్మ తమను పెంచడానికి ఎంతో కష్టపడేది.అమ్మ కష్టాన్ని చూసి చిన్నప్పుడు దుఃఖం వచ్చేది.రెండో కూతురుగా ఉన్న నేను కుటుంబ కష్టాలు తీరాలంటే పెద్ద చదువులు చదువుకొని పెద్ద ఉద్యోగం చేయాలని అనుకునేదాన్ని. అమ్మకు సాయపడుతూనే పీజీ చేశాను. పేదరికం అనుభవిస్తూ క్రమశిక్షణతో చదువు కున్నాను. లింగపాలెం వెలుగు ఏపీఎంగా పనిచేస్తున్నాను. ప్రతి ఆడకూతురు జీవితంలో పైకి రావడానికి క్రమ శిక్షణతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాన్ని అందుకోవచ్చు.

పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్నది లక్ష్యం
సుజాత కుమారి శ్రీ సాయి, శ్రీ ప్రతిభ కాలేజీల డైరెక్టర్

ఆడపిల్లలపై వివక్షత పోవాలంటే ప్రతి మహిళ విద్యావంతురాలుగా ఉండాలి.చిన్నప్పుడు నాలో కలిగిన భావాలకు జీవం పోయాలనుకున్నాను. ఆ లక్ష్యంతోనే చదువుకున్నాను. ఐదవ తరగతి పూర్తవుగానే నవోదయ పరీక్షలు రాసి సెలెక్ట్ అయ్యాను. 6వ తరగతినుంచి సీబీఎస్ఈ కోర్సులోనే చదువుకున్నాను. ఎం ఫామ్ పూర్తి చేశాక పీహెచ్డీ చేశాను. ఎనిమిదేళ్లపాటు నూజివీడులోని ఫార్మసీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశాను.ఈ సమయంలో విదేశాలలో ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. వెళ్లాలని పించలేదు. ఈ ప్రాంతంలోనే గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంగా భావించాను. దీంతో ధర్మాజీ గూడెంలో ప్రతిభ కాలేజీ స్థాపించాను. దీంతోపాటు ఇదే గ్రామంలోని శ్రీసాయి కాలేజీని తీసుకున్నాను.ఈ కాలేజీల ద్వారా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని కృషి చేస్తున్నాను. చదివే విద్యకు సార్ధకత ఉండాలి. సార్ధకత రావాలంటే నాణ్యమైన విద్యను అలవర్చుకోవాలి. కాలేజీల నిర్వహణలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళుతున్నాను. తన ద్వారా నాణ్యమైన విద్య విద్యార్థులకు అందితే చాలని భావిస్తున్నాను.

పది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-టి నరసాపురం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖాధికారి టి. రామ్మూర్తి తెలిపారు. స్థానిక మానవ వనరుల కేంద్రం లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు టి నరసాపురం, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు,అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 470 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్, బల్లలు, త్రాగునీరు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

సూర్యనారాయణరాజుకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర- ఉండి : రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్గా ఉండి మండలం పాం దువ్వ గ్రామానికి చెందిన వేగేశ్న సూర్య నారాయణ రాజు(కనకరాజు సూరి) విజయవాడ రామ వరప్పాడు లోని ఎస్. ఎల్. వి. గ్రీన్ మెండోస్ క్లబ్ లో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. సూర్య నారాయణ రాజు తో పాటు 15 మంది బోర్డు సభ్యులచే ఎండి మహేం దర్ రెడ్డి ప్రమాణం స్వీకారం చేయించారు. ఆయనను పలువురు దుస్సాలువాలతో, పుష్పగుచ్చాలతో, భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రామానుజపురం గ్రామ సర్పంచ్ అడపా నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం గ్రామంలోని అంటు వ్యాధులు ప్రబలకుండా దోమల మందును పిచికారి చేస్తున్నట్లు ఆమె తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని విష జ్వరాల నుంచి కాపాడుకోవచ్చునని ఆమె గ్రామస్తులకు తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని , గ్రామస్తులంతా సహకరించాలని ఆమె పేర్కొన్నారు.

తలసేమియా బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: పట్టణంలోని ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా కేర్ సెంటర్ ను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి సందర్శించి తలసేమియా బాధితులకు అందిస్తున్న వైద్య చికిత్ససేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మీ మాట్లాడుతూ తలసేమియా బాధితుల ఆరోగ్యంకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్టుద్వారా చేస్తున్న కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 50 లక్షల రూపాయలు విరాళం ఇచ్చి చిన్నారుల ప్రాణాలు కాపాడుతున్నారని గుర్తు చేశారు. ఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ అధినేత అల్లూరి సూర్యనారాయణరాజు మాట్లా డుతూ తలసేమియా పిల్లలకోసం గుండె శాస్త్ర చికిత్స ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ పి.చంద్రశేఖర్ వర్మచే 4 వేల రూపాయల గుండెవైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్య సహాయాన్ని అందిస్తున్నామని త్వరలోనే తలసేమియా మల్టీస్పెషల్టి కేర్ సెంటర్ ప్రారంభించనున్నామని తెలిపారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అనేకమంది చిన్నారులు తల సేమియా వ్యాధితో మరణిస్తున్నారని వారందరినీ కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ప్రముఖ గుండెశాస్త్ర చికిత్స వైద్యులు డాక్టర్ పి.చంద్రశేఖర్ వర్మ మాట్లాడుతూ తలసేమియా చిన్నారులను కాపాడాలన్న సదుద్దేశంతో వారికి ఉచిత వైద్యపరీక్షల నిర్వహిస్తూ వైద్య సహాయాన్ని అందిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జి.రామకృష్ణంరాజు, డాక్టర్ పి.రాణిచంద్ర, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్ ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ విధాత్రి ఏ.ఎస్.ఎన్ రాజు ట్రస్ట్ సభ్యుడు వేమిరెడ్డి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

భారత్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ (BPCL) వారు తెలియజేయునది ఏమనగా ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, రావిచర్ల రెవిన్యూ గ్రామ పరిధిలోని SH- 238 ప్రక్కన, సర్వే నెంబర్ 70/6; 70/7 or LPM No. 2153 లోని **తూర్పున** : SH- 238; **దక్షిణమున** తన్నేరు తేజ మూర్తి వారికి చెందిన భూమి **పడమర** : చీరాల ఆశీష్ గారి భూమి **ఉత్తరం** : నజ్మర బేగం గారి భూమి ఈ హద్దుల నందు గల **య. 0.30** లతో నూతన భారత్ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయుచున్నాము. సదరు భూమి విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న తగిన ధృవీకరణ పత్రాలు తీసుకొని తమ ఆఫీసు సందు పదిరోజులలోపు వచ్చి తెలియజేయగలరు. లేని యెడల రిజిస్టర్ పోస్ట్ చేసి ఎకనాలడ్జిమెంట్ తీసుకోగలరు. పదిరోజుల తరువాత వచ్చిన అభ్యంతరములు భారత్ పెట్రోలియం కార్పోరేషన్ వారు పరిగణలోకి తీసుకొనబడరు.

టెరిటరి మేనేజర్ (రిటైల్)
విజయవాడ భారత్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్,
సెల్ : 94464 79076
కొండపల్లి (టాప్), పినపాక గ్రామము & పోస్ట్,
విజయవాడ - 521 228, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - గణపవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, లింగ వివక్ష పూర్తిగా అంతమయ్యేలా భవిష్యత్ తరాలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల సిబ్బంది అందరూ వారి జీవితంలో భాగమైన మహిళలకు "థాంక్ యు నోట్" రాసి కృతజ్ఞతను తెలియచేశారు. ఐక్యు ఏసి ఆధ్వర్యంలో కళాశాల బెస్ట్ ప్రాక్టీస్ "రెస్ట్ ఫర్ హర్"లో భాగంగా గణపవరం చుట్టుపక్కల గ్రామాలలో నివసిస్తున్న 15 మంది నిరుపేద మహిళలను చీరలతో సత్కరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ఆధ్వర్యంలో కళాశాల మహిళా సిబ్బందిని సన్మానించారు. విద్యార్థులకు "భారదేశంలో మహిళా నాయకులు" అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ కాంపిటీషన్ "మహిళా సాధికారిత " అనే అంశంపై ఫోటోగ్రఫీ కాంపిటీ షన్ను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. మధు రాజు, కోఆర్డినేటర్ డాక్టర్ సి. హెచ్. చైతన్య, మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ డాక్టర్ కె. స్వరూప రాణి అధ్యాపకులు , సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దండు మారమ్మ అమ్మవారి జాతర

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం గ్రామ దేవత దండు మారెమ్మ అమ్మవారి 326వ జాతర మహోత్సవం ఈ నెల8 నుండి 16 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ శుక్రవారం తెలిపింది.శనివారం అమ్మవారి గవళ్ళ గుడుపు సేవ, తదనంతరం 8 రోజులపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి 16వ తేదీ ఆదివారం అఖండ అన్న సమారాధన జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ జాతరను చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారు తర్వాత కొల్లేటి గ్రామాలకు అతి దగ్గరలో అతి పెద్ద ఆలయం దండు మారమ్మ ఆలయంలో నిత్యం పూజలు జరుగుతాయి.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : కాకినాడ జిల్లా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశం స్థానిక ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్లో జిల్లా అధ్యక్షులు రమణరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కే శ్రీనివాసరాజు, జోనల్ అధ్యక్షులు డిఎంఆర్ రాజు (జోన్-2), జోనల్ కార్యదర్శి ఏ రామారావు(జోన్-2)లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వై శ్రీనివాసరావు మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఆర్టీసీ అధికారులు ఉద్యోగులకు విధిస్తున్న శిక్షలపై దుయ్యబట్టారు. ముఖ్యంగా ఏలేశ్వరం డిపో మేనేజర్ టీమ్ డ్రైవర్ ఎస్వీ రమణను, కాకినాడ డిపో మేనేజర్, టీమ్ డ్రైవర్ ఆర్ అబ్బులను, 1/2019 సర్కులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేయడం, విసి అండ్ ఎండి ఇచ్చిన ఆదేశాలను పాటించకపోవడం ఏమిటన్నారు. ఆర్టీసీ అధికారులు ఈ వేధింపులు ఆపాలని ముఖ్యంగా డ్రైవర్ ఎస్వీ రమణను, డ్రైవర్ ఆర్ అబ్బులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి, తక్షణమే విధుల్లోకి తీసుకోలేని పక్షంలో ఈ ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా నిర్ణయం తీసుకుంటామని అవసరమైతే ప్రభుత్వం వద్దకు వెళ్లి సమస్య శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కార్యదర్శి ఏవి రావు, ఏలేశ్వరం డిపో అధ్యక్షులు కే కామేశ్వరరావు, కార్యదర్శి కే త్రిమూర్తులు, కాకినాడ డిపో అధ్యక్షులు గోవిందు, కార్యదర్శి చక్రం, తుని డిపో అధ్యక్షులు ఎమ్మెన్ ఎన్ రాజు, కార్యదర్శి సాయిరాం, ఏలేశ్వరం, కాకినాడ, తుని డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే, పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష

విశాలాంధ్ర - కోరుకొండ : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు పరిష్కార విధానంలో మార్గదర్శకాలు పాటించేలా చూడాలని, పరిష్కార నిర్ణయంకు చెందిన వాటి రికార్డులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కోరుకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్‌తో కలిసి కలెక్టర్ అర్జీలు పరిష్కార విధానం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, రీ సర్వే ప్రక్రియ చేపట్టడంతో, అర్జీలు పరిష్కార విధానంలో జవాబుదారీతనం ఖచ్చితంగా పాటించాలన్నారు. ఇదే క్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు, వాటిని పరిశీలించి పరిష్కార దిశగా తీసుకున్న చర్యలకు చెందిన పత్రాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అర్జీ దారులు సంతృప్తి చెందేలా పరిష్కరం చేయాలన్నారు. రీ సర్వే సమయంలో ఏటువంటి అంశాలని పరిష్కారం చేస్తున్నాం అని అడుగగా, భూమి కొలతల్లో వత్యాసాలు , జాయింట్ ఎల్పి కోరిలేషన్ , 22 ఏ, దిద్దుబాటుకు సంబంధించినవి , ఇనాం ల్యాండ్ తదితర వాటికీ సంబంధించి అర్జీలు పరిష్కారం చేయ్యాల్సి ఉంటుందన్నారు. వీటికి సంబంధించి 75 రోజుల్లో పరిష్కారం దిశగా తీసుకున్న చర్యలను చెందిన రికార్డులు అందచేయాలని కలక్టర్ ఆదేశించారు. జవాబుదారీతనం , పారదర్శక విధానం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే ప్రయత్నం చెయ్యాలని కలక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా రీ సర్వే కి చెందిన 924 అర్జీలను కోరుకొండ మండలం లో పరిష్కారం చేసినట్లు, వాటికీ అనుసంధానం గా రికార్డులు అందచేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష లు ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, తహసిల్దార్ వి.సుస్వాగతం , ఇతర రెవెన్యు సిబ్బంది హాజరయ్యారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ బార్ అసోసియేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని న్యాయమూర్తులు, మహిళ న్యాయవాదుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. న్యాయవ్యవస్థలో మహిళా న్యాయవాదుల అంతా ముందంజలో ఉండాలని పలువురు జడ్జిలు పిలుపునిచ్చారు. జడ్జిలు పీ కమలాదేవి, కే శ్రీదేవి, నికిత ఆర్ ఓరా, ఎం హరి నారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని మరింత ప్రోత్సాహాన్ని ఇస్తే మరిన్ని విజయాలు తథ్యమని పలువురు జడ్జిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదుల సమక్షంలో జిల్లా జడ్జిలు కేకును కట్ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా అనేక పోటీల్లో విజయం సాధించిన మహిళా న్యాయవాదులకు బహుమతులను అందజేశారు. న్యాయవాదులు అంతా కలిసి జడ్జిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, కార్యదర్శి చెక్క శ్రీనివాసరావు, లేడీ రిప్రజెంటివ్ జి సునీత, సరోజిని, ఉమా గౌరీ, బిందుశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

500 పడకల ఆసుపత్రి సందర్శన

విశాలాంధ్ర - కాకినాడ : శుక్రవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో నిర్మాణ దశలో ఉన్న 500 పడకల ఎంసీహెచ్ బ్లాక్, టీబీ వార్డు, తల్లి బిడ్డ వార్డులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జీజీహెచ్ వైద్య అధికారులు, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జీజీహెచ్ వైద్య సేవలు మెరుగుపరిచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన, పాత భవనాలు స్థానంలో కొత్త భవనాలు నిర్మించేంతవరకు ప్రత్యామ్నాయ అవకాశాలపై వైద్య అధికారులు, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ లావణ్య కుమారి, ఆంకాలజీ విభాగం హెచ్వోడి డాక్టర్. శ్రీనివాసన్ పాల్గొన్నారు.

భూముల రీ సర్వే సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర తాళ్లపూడి: భూముల రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని, దీనిలో భాగంగా డ్రోన్ ద్వారా సేకరించిన ఓ.ఆర్.ఐ మాప్‌ల ప్రకారం ఏ రైతుకు ఎంత భూమి ఉందన్నది తెలిపామని భూమి యజమానులకు ఎదురయ్యే ఇబ్బందులపై రెవెన్యూ శాఖ చర్యలు తీసుకుం టుందని ఇంచార్జి తహసీల్దార్ మోహన భారతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ పరిధిలోని కుకునూరు సచివాలయం వద్ద వీరభద్రపురం రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అవగాహన కల్పిస్తూ ఒక ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ టి.వెంకటే శ్వరరావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ టి. వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ సత్య నారా యణ, మండల ఆర్ఐ రామకృష్ణ, టీడీపీ మండల నాయకులు నామన పరమేశ్వరరావు, వీఆర్వో లు లీల, సంజీవ్, సంతోష్ సచివాలయ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

9న పెద్దిపాలెంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో ఈ నెల 9న రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు వైఆర్సీ కాలువ రోడ్లో ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ పోటీల్లో సీనియర్స్ జూనియర్స్ విభాగాలకు విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

ది జాంపేట కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి.,
నెం.46/బి, రాజమహేంద్రవరం.

123 వ సాధారణ మహాజన సభ నోటీసు

ది.28.03.2025 న అనగ శుక్రవారం సాయంత్రం 4.00గం॥లకు బ్యాంకు యొక్క 123 వ సాధారణ మహాజన సభ బ్యాంకు భవనము నందు ఏర్పాటు చేయడమైనది. కావున 'ఎ' తరగతి సభ్యులు ఈ సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరడమైనది.

-: ఎజెండా అంశములు :-

1. ది 01.07.2024 నుండి ది 28.02.2025 వరకు బ్యాంకులో సభ్యత్వం తీసుకున్న "ఎ" తరగతి సభ్యుల జాబితాను ఆమోదించుట గురించి.
2. ది 01.07.2024 నుండి ది 28.02.2025 వరకు షేరుధనం వాపసు చేయబడిన "ఎ"తరగతి సభ్యుల జాబితాను ఆమోదించుట గురించి.
3. బ్యాంకు పాలకవర్గం వారిచే ది 01.07.2024 నుండి ది 28.02.2025 వరకు మంజూరు కాబడిన అప్పులను రేటిఫై చేయుట గురించి.
4. బ్యాంకు డిపాజిట్లు, లోన్సు & అడ్వాన్సులు మరియు ప్రభుత్వ సెక్యూరిటీలు, ఇతర బ్యాంకులు/సంస్థలలో పెట్టిన పెట్టుబడులను సమీక్షించుట గురించి.
5. బ్యాంకునకు 3 వాయిదాలు దాటి బకాయిపడిన అప్పు ఖాతాదారుల జాబితాను పరిశీలించుట గురించి మరియు బ్యాంకు యొక్క నిరర్ధక ఆస్తుల విషయమై చర్చించుట గురించి.
6. వివిధ బ్రాంచీలలో ప్రారంభించిన ఎ.టి.యం. ల ద్వారా జరిగిన వ్యాపారమును సమీక్షించుట గురించి.
7. 2025-26 సం॥నకు కంకరెంట్ ఆడిటర్ నియామకము చేయుట గురించి.
8. బ్యాంకు యొక్క ఆర్థిక పరిస్థితిని సమీక్షించుట గురించి.
9. బ్యాంకు ఛైర్మన్ గారి అనుమతితో ప్రవేశపెట్టబడు ఇతర అంశములపై చర్చించుట గురించి.

రాజమహేంద్రవరం,
ది.06-03-2025.

సంతకం Sd...... యం.విజయ ప్రతాప్ ఇన్‌చార్జ్ సెక్రటరీ/ సి.ఇ.ఓ.

సంతకం Sd...... బొమ్మన జయకుమార్ ఛైర్మన్

గమనిక : మహాజన సభకు హాజరగు 'ఎ' తరగతి సభ్యులు తమ సభ్యత్వ గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తీసుకొనిరావలెను.

ప్రజలు ఛీ కొట్టినా ప్రతిపక్ష హోదానా?

- ప్రజాసమస్యలు పట్టని వైసీపీనాయకులు
- పారాచ్యూట్ లీడర్ భరత్ ప్రెస్ మీట్లకు, రీల్స్ కు పరిమితం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : ప్రజలు ఛీ కొట్టినా వైసీపీ వారు ప్రతిపక్ష హోదా అడుగుతుంటే జనం చూసి నవ్వుకుంటున్నారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మాజీ సీఎం జగన్ నుంచి రాజమండ్రి పారాచ్యూట్ లీడర్, మాజీ ఎంపీ మార్గాని భరత్ వరకు ఇదేతంతని విమర్శించారు. ప్రతిపక్ష వైసీపీ నాయకులు ప్రజా సమస్యల పట్ల, అభివృద్ధి పట్ల బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలకు రాకపోవడం దుర దృష్టకరమని అన్నారు. చట్ట సభలంటే గౌరవం, బాధ్యత లేని జగన్‌కు ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నిం చారు. ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టినా ప్రతిపక్ష హోదా అంటూ గగ్గోలు పెడుతున్న జగన్ వింతవైఖరి చూసి జనం నవ్వుకుంటున్నారని అన్నారు. మాజీ ఎంపీ, పారా చ్యూట్ లీడర్ భరత్ అయితే ప్రెస్ మీట్లు పెట్టడం, లేదంటే రీల్స్ చేసుకోవడమే సరిపోతోందని విమర్శించారు. ప్రతిపక్షానికి బాధ్యత, విలువ ఉంటుందని కాని వైసీపీ నాయకులు మాత్రం అలా ఉండరని అన్నారు. తాము ప్రతిపక్షంలో ఉండగా ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రభుత్వానికి వాటిని ఎత్తి చూపేవారమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గుర్తు చేశారు. తమ కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు అయిందని, కాని ప్రతిపక్ష పారాచ్యూట్ లీడర్ భరత్ ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ఏదేదో అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తనకు సిటీలోని 42 వార్డుల్లో ఏ సందులో ఏసమస్య ఉందో పేర్లతో సహ చెప్పగలనని పారాచ్యూట్ లీడర్ అలా చెప్పగలడా అని నిలదీశారు. వైసీపీ నిర్లక్ష్యం వల్ల ఐదేళ్లగా నష్టపోయిన రాజమండ్రి సిటీకి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లపై ఉక్కుపాదం మోపామని, మహిళా కళాశాలలో సమావేశాలు నిర్వహించి మహిళా రక్షక్ ఏర్పాటు చేశామని చెప్పారు. పేపరుమిల్లు పరంపర కార్మికులకు ఉద్యోగాలు వేయించి రూ. కోట్లు పంచుకున్నారని, కాదని చెప్పే ధైర్యం మాజీ ఎంపీకి ఎందుకు లేదని నిలదీశారు. మీడియా సమావేశాలు పెట్టి పసలేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నగరం నడిబొడ్డున ఉన్న గౌతమీ సూపర్ బజారుకు చెందిన రూ.5 కోట్ల స్థలాన్ని కాపాడామని చెప్పారు. 11 ఏళ్ళ లీజును అక్రమంగా 33 ఏళ్ళ లీజుకు ఎలా ఇచ్చారని, వారు కోర్టుకు వెళ్ళినా నిర్మాణాలు జరగకుండా ఆపగలిగామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మూడు మద్యం షాపులు మాజీ ఎంపీ భరత్ పక్కన ఉండే వ్యక్తికే లాటరీలో వచ్చాయని అయినా అందులో ఏదో జరిగి పోతున్నట్లు గగ్గోలు పెడుతున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వ్యాఖ్యానించారు. దీనిపై జనసేన సిటీ ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ భరత్‌తో వుండే మేకాకు మద్యం షాపులు వచ్చాయని, అందులో లాభాలు లేవు, నష్టపోతున్నామని మద్యం వ్యాపారులు చెబుతుంటే ఇంకా ఎమ్మెల్యేకు ముడుపులు ఎలా ఇస్తారని ప్రశ్నిం చారు. విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, నరేంద్ర, రెడ్డి మణేశ్వరరావు, మజ్జి రాంబాబు, యిన్నమూరి దీపు, ద్వారా పార్వతి సుందరి, శెట్టి జగదీష్, నల్లం శ్రీను, బుడ్డిగ రవి, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

10న 'జాబ్‌మేళా'

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈనెల 10 సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడలో 'జాబ్‌మేళా' నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళా హైకిన్స్ కంపెనీల్లో గ్రోత్ అసోసియేట్, భవిక్రియేషన్స్ కంపెనీలో డిజైనర్, టెలికాలర్, మార్కెటింగ్ పర్సన్స్, ఆక్వాప్రాసెసింగ్ కంపెనీలో వివిధ విభాగాల్లో స్టాఫ్, ఇసుజుమోటార్స్, ఇండో ఎం.ఐ.ఎం. హోండాయ్ మోబిస్, పానాసోనిక్ & కె.ఐ.ఎం.ఎల్ కంపెనీల్లో టెక్నిషియన్, ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. డి.డి.యు.జి.కె.వై. ద్వారా టువీలర్, టెక్నిషియన్, లాజిస్టిక్స్ విభాగాల్లో మూడు నెలలు ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. పైఉద్యోగాలకు, ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ & బి టెక్ ఉత్తీర్ణులైన 30 సం.లోపు అభ్యర్థులు అర్హులు. 'వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ' వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. వివరాలకు 7799376333 డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. వికాస జాబ్స్.కం సంప్రదించగలరు.

మధ్యాహ్న భోజనం స్టీరింగ్ కమిటీ

విశాలాంధ్ర-తాళ్లపూడి : ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజనం పథకం సక్రమ నిర్వహణకు మండల స్థాయి లో స్టీరింగ్ కమిటీ ని నియమించినట్లు తాళ్లపూడి మండల ఎంఈఓ సి.ఎచ్. బాలామణి వెల్లడించారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎం.ఈ.ఓ-2 నెహ్రూజీ మాట్లాడుతూ తహసీల్దార్ చైర్మన్‌గా ఎంపీడీఓ, ఎంఈఓలు, ఒక ఎచ్.ఎం, సివిల్ సప్లయ్ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్, పబ్లిక్ తరపున ఎంపీపీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. పిల్లలు అందించే ఆహారాన్ని నిత్యం రుచి చూడాలని, కమిటీ సభ్యులు విడివిడిగా , కనీసం వారానికి ఒక్క సారైనా మధ్యాహ్న భోజనం పథకాన్ని పరీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ టిబివి రమణ, డా.హారిక గుప్తా, ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, తాళ్లపూడి ఎచ్.ఎం సుబ్బలక్ష్మి, టీడీపీ అధ్యక్షులు నామన పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - రావులపాలెం : కర్రీ సుబ్బి రెడ్డి ఇటీవల మరణించగా మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, సానుభూతిని తెలియజేశారు. కొమరాజులంక సర్పంచ్ కర్రీ వెంకట గోవింద కృష్ణారెడ్డి మామ గుడిమెట్ల విజయభాస్కర్ రెడ్డి ఇటీవల మృతి చెందగా చిర్ల జగ్గిరెడ్డి కృష్ణారెడ్డిని, కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

IN THE COURT OF IV ADD. DIST. JUDGE: KAKINADA
I.A. 98/2022 in O.S. 202/2015
Between:
Padala Abbulu Reddy, S/o. Subbu Reddy, Age 60 years, Cultivation, R/o. Door No. 2-33, Pandalapaka, Bikkavolu Mandal, East Godavari District, Ramachandrapuram Court Jurisdiction.
...Petitioner/Plaintiff
AND
Mandapati Jagadeeswari, D/o. Bhairava Murthy, Age 28 years, House Wife, R/o. Door No. 08-08-031, Chinta Street, Yanam, Pondicherry State, Yanam Courts Jurisdiction.
...Respondent/Defendant
పై నెంబరు దావాలో పిటీషనర్ / వాది దాఖలు చేసుకున్న I.A. 98/2022లో మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోనందు కాలయాపన చేయుచున్నందున మీ హాజరు నిమిత్తం ది. 20-03-2025 తేదీన పై కోర్టు నందు ఉదయం గం. 10-30 ని.లకు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ అభ్యంతరములు ఏమైనా ఉన్న యెడల శ్రీ కోర్టువారికి తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
V.N.V.V. SRIRAMA MURTHY, Advocates,
Kakinada D.No. 20-11-13, Ratnatowers, Mesjestic Street,
Dt. 05-03-2025 Kakinada.Cell: 96486 20708, 94410 76391

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-దేవరపల్లి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలు వీర మహిళకు పోలవరం నియోజవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే గోపాలపురం నియోజకవర్గం పరిశీలకులు చిరు బాలరాజు గోపాలపురం జనసేన పార్టీ నియోజకవర్గ డి సువర్ణ రాజు అన్నారు . దేవరపల్లిలో గోపాలపురం నియోజకవర్గస్థాయి సన్నాక ఆత్మీయ సమావేశం దేవరపల్లి కళాశాల సెమినార్లో శు క్రవారం సాయంత్రం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలవరం ఎమ్మెల్యేబాలరాజు మాట్లాడుతూ ఈనెల 14న జనసేన పార్టీ ఆవిర్భావం దినోత్సవం పిఠాపురం నియోజకవర్గం లోని చిత్రాడ గ్రామంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమానికి పార్టీ అధినేత రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రసంగిస్తారు అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సమన్వయకర్త వై శ్రీనివాసు వై రాజు ఎం రవి నరసింహమూర్తి బాపిరాజు గణపతి సలాది వేణు మాధవి కవల సీతారత్న సూర్యకుమారి చింతల గోపాలపురం నియోజకవర్గం లోని నాయకులు కార్యకర్తలు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను డి సువర్ణ రాజు ఘనంగా సత్కరించారు అనంతరం చలో పిఠాపురం పోస్టర్ విడుదల చేశారు.

పుష్కర ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో పర్యటన

విశాలాంధ్ర - సీతానగరం: గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పై క్షేత్ర స్థాయిలో దిల్లి నుంచి వచ్చిన ప్రత్యేక బృందంతో కలిసి రాజమహేంద్రవరం రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ శుక్రవారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా 2027లో అత్యంత ప్రతిష్టత్మకంగా జరగనున్న పవిత్ర అఖండ గోదావరి నదికి జరగనున్న పుష్కరాలకు ఏర్పాట్ల కోసం దిల్లి నుంచి వచ్చిన ప్రత్యేక బృందంతో కలిసి రాజమహేంద్రవరం రూరల్ కాతేరు, సీతానగరం మండలంలో ములకల్లంక, పురుషోత్తపట్నం మొదలగు గ్రామాల్లో బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మునుపెన్నడూ చూడని రీతిలో గోదావరి పుష్కరాల జరపాలని దృఢ సంకల్పంతో ఉందని దానికి అనుగుణంగా దిల్లి నుంచి వచ్చిన ప్రత్యేక బృందంతో ఎక్కడ ఎక్కడ ఏమి ఏర్పాట్లు చేయాలనే అంచనా కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ, అసెన్ను బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు శ్రీనివాసా అటానమస్ ఇంజ నీరింగ్ కళాశాలలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాస కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా" అనే ఆర్యోక్తి అనుగుణించి ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని, నవ సమాజనిర్మాణంలో అర్ధ భాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికికి మూలం అన్నారు. నవ భారత నిర్మాణంలో స్త్రీ శక్తి అద్వితీయమని, వివిధ నారీమణులు ఆయా రంగాల్లో చేసిన కృషిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఉత్తేజ భరితంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న అమలాపురంకు చెందిన ప్రముఖ షుగురు వ్యాధి నిపుణులు డాక్టర్ జి అంజలి మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో, తమ ఆర్థిక అవసరం తామే తీర్చుకొనగలిగే ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులకు వివిధ అంశములైన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, మెహందీ, పోస్టర్ విభాగము, వ్యాసరచన, నిప్పు లేకుండా వంటకములు చేయు అంశములు యందు పోటీలను నిర్వహించి అద్భుతప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్క్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజంలో మహిళల పాత్ర కీలకం

విశాలాంధ్ర - ఆలమూరు : నేటి సమాజంలో జాతి నిర్మాణం, సమగ్రత, సామరస్యత, శాంతి పెంపొందించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వారే వెలుగు రేఖలని ప్రముఖ న్యాయవాది, వెన్నెల సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేమగిరి నరసింహ మూర్తి అన్నారు. మండలంలోని మూలస్థానం జెడ్పి ఉన్నత పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా మహిళా స్వావలంబన సదస్సు సర్పంచ్ లంక వరప్రసాదరావు అధ్యక్షతన శు క్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఒక అమ్మగా జన్మనిస్తుందని, భార్యగా బాధ్యతలను మోస్తుందని, ఓ అక్కగా కష్టాల్లో తోడు నిలుస్తుందని, చెల్లిగా స్నేహాన్ని చిలిపి అల్లరిను పరిచయం చేస్తుందని, కూతురిగా ప్రేమను పంచుతుందని ఇలా ఎన్నో రకాలుగా మహిళలు ఏదో ఒకచోట తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భావిశెట్టి తాతాజీ, వార్డ్ మెంబర్ తోట నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు జి సీతారామ శర్మ, కార్యదర్శి సిహెచ్ వీరమాత, ఎంఎల్ హెచ్పి సిహెచ్ఓ హెలెన్, యానిమేటర్స్ సువర్ణ, వనజ, చంద్రకళ, అంగన్వాడీ విజయ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యారేజీలో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - ఆలమూరు : కారు గ్యారేజీలో అగ్నిప్రమాదం చోటు చేసుకుని రెండు కార్లు దగ్ధమైన ఘటన ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామంలో చోటు చేసుకుంది. 216(ఎ)నెంబరు గల జాతీయ రహదారి చెంతన ఉన్న కాలా సురేష్ అనే వ్యక్తికి చెందిన కారు గ్యారేజీలో వెలుపల గురువారం అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో వర్కర్లు ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఖరీదైన రెండుకార్లు అగ్నికి ఆహుతయాయని వాటి విలువ సుమారు ఐదు లక్షల రూపాయలు ఉంటుందని గ్యారేజ్ యజమాని తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న హైవే పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేసి వివరాలు సేకరించారు.

గాలికుంటువ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర - ఆలమూరు : పాడి రైతులు పశువులకు అందించే గాలికుంటువ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మోదుకూరు టీడీపీ నాయకులు చుండ్రు శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ ఏడి ఎల్ అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. ఈవ్యాధి నివారణకు సంబంధించి పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమన్నారు. అదేవిధంగా గ్రామంలో యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్ కుంచె రమేష్, గోపాల్ మిత్ర నేతల ప్రకాష్ కలిసి రైతులకు అందుబాటులో ఉంటూ అనేక సేవలు అందిస్తున్నారని అభినం దించారు. ఈ కార్యక్రమంలో గుమ్మిలేరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుభాష్, రాంబాబు, జి మహేష్, ఎం ప్రకాష్, డి మురళి, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.

పటిక బెల్లం తులాభారం

విశాలాంధ్ర దేవరపల్లి : దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో శు క్రవారం అంగరంగ వైభవంగా రెండు పటిక బెల్లం తులాభార కార్యక్రమాలు జరిగాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం పెద్ద కాపవరం గ్రామానికి చెందిన జద్దు అనిల్ కూమార్ కుసుమలత దంపతుల కుమారుడు యశ్వంత్ కల్యాణ్ కుమార్తె రేష్మితకు పటిక బెల్లంతో తులాభారాలు నిర్వహించారు అంతకుముందు బాలదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్య నారాయణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు కమిటీ సభ్యులు గారపాటి అప్పారావు పిన్న మని వెంకట కృష్ణ కామిశెట్టి ధర్మరాజు కామిశెట్టి మంగ మాతు సీత ఆలయ కమిటీ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు

మహిళా దినోత్సవ వేడుక

విశాలాంధ్ర - జగ్గంపేట : నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మండల కేంద్రమైన జగ్గంపేటలోని 14వ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిం చారు. అంగన్వాడీ కేంద్రం టీచర్ కృపా బాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక సీడీపీఓ ఎమ్ పూర్ణిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక మహిళ తనదైన శైలిలో ముందుకు రావాల న్నారు. నేటి సమాజంలో పురుషుడితో సమా నంగా స్త్రీ ప్రతి రంగంలో పనిచేస్తుందన్నారు. అనంతరం గర్భిణీలకు బాలింతలకు పోషకా హార కిట్లు, బాల సంజీవిని కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత, సచివాలయం 2 వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది దేవి తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పిన సెన్సోడైన్

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: హాలియన్ కు చెందిన ప్రముఖ నోటి సంరక్షణ బ్రాండ్ సెన్సోడైన్ 'ఆన్లైన్‌లో 24 గంటల్లో అత్యంత ఎక్కువ దంత పరీక్ష పరీక్షలను' విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను నెలకొల్పింది. మహా కుంభ్ 2025లో రికార్డు నెలకొల్పగా, ఈ ప్రయత్నంలో 27,000 మందికి పైగా వ్యక్తులు దంత పరీక్షలు చేయించుకున్నారు. ఇది చురుకైన నోటి సంరక్షణ ప్రాముఖ్యత గురించి భారతీయులకు అవగాహన కల్పించడంలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. తన నిబద్ధతను మరింత ముందుకు తోడ్కొని వెళ్లేందుకు సెన్సోడైన్ కొత్తగా విడుదల చేసిన రూ. 20 ధరకు లభించే చిన్న టూత్‌పేస్ట్ ప్యాక్‌ను కూడా వితరణ చేసింది. ఇది సెన్సిటివిటీ రక్షణను మరింత సరసమైనదిగా, మరింత అందుబాటు లోకి తీసుకువచ్చేలా తయారు చేశారు. ఈ రికార్డు సెన్సోడైన్ ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ ప్రచారానికి నాంది పలికింది. ఇది మెరుగైన ఓరల్ హెల్త్ వైపు వ్యక్తులు మొదటి అడుగు వేయమని ప్రోత్సహించే లక్ష్యాన్ని కలిగి ఉంది.

సల్ఫర్ తయారీ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-కాకినాడ: భారతదేశంలోని ప్రముఖ వ్యవసాయ పరిష్కార ప్రదాతలలో ఒకటైన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉన్న తమ కేంద్రంలో రెండవ సల్ఫర్ తయారీ కర్మాగారాన్ని ప్రారంభించింది. విశాఖపట్నం సైట్ కంపెనీ యొక్క పూర్తి బ్యాక్ వార్డ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్. ఫాస్ఫారిక్ ఆమ్లం మరియు సల్ఫ్యూరిక్ ఆమ్లం తో పాటు సుమారు 12 ఎల్ఎంటి కాంప్లెక్స్ ఎరువులను ఉత్పత్తి చేస్తుంది. ఈ సైట్ 25000 ఎం టీ ఉత్పత్తి సామర్థ్యంతో సల్ఫర్ ఎరువుల కర్మాగారాన్ని కలిగి ఉంది. ఈ కొత్త ప్లాంట్ ప్రారంభంతో, కంపెనీ సల్ఫర్ ఎరువుల సామర్థ్యం రెట్టింపు అవుతుంది, ఇది రైతులకు అధిక-నాణ్యత గల బెంటోనైట్ సల్ఫర్ ఎరువుల స్థిరమైన సరఫరాను నిర్ధారిస్తుంది. ఈ విస్తరణ స్పెషాలిటీ న్యూట్రియంట్స్ మార్కెట్‌లో కోరమాండల్ కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటుగా , భారతీయ వ్యవసాయం పట్ల దాని నిబద్ధతను పునరుద్ఘాటించటంలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుంది. ఈ కార్యక్రమానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎండి ఎస్ శంకరసుబ్రమణియన్, స్పెషాలిటీ న్యూట్రియంట్, ఆర్గానిక్ ఫెర్టిలైజర్స్ బిజినెస్ హెడ్ అవినాష్ ఠాకూర్ ఇతర సీనియర్ బృంద సభ్యులు హాజరయ్యారు.

కామన్ ఎంట్రెన్స్ టెస్టు రద్దు చేయాలని వినతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్టర్ కలిసి బొకే అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ ఏఐవైఎఫ్ కార్యదర్శి త్రిమూర్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ సంబంధించి కామన్ ఎంట్రెన్స్ టెస్టును రద్దు చేయాలని యూనివర్సిటీ రిజిస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు 10లక్షల పైగా ఉన్నారని, కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తిని కలిగేలాగా చూడాలని రిజిస్టర్‌ను కోరారుజ నన్నయ యూనివర్సిటీకి యుజిసి గ్రాంట్లు మంజూరు అయ్యేలాగా ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి తో చర్చలు జరపాలని వారు కోరారు . యూనివర్సిటీలో మహిళల హాస్టల్‌లో భోజనంలో పురుగులు ఉన్నాయని గతంలో ఏఐఎస్ఎఫ్ నాయకులకు తెలియజేశారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. నన్నయ యూనివర్సిటీకి అనుబంధంగా 545 కాలేజీలు వీటిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయని వీటి అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలాగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎం లక్ష్మణ్, వై శ్రీను, కే చిన్న ఎం వినోద్ తదితరులు పాల్గొన్నారు

మహిళా దినోత్సవ వేడుక

విశాలాంధ్ర - పిఠాపురం : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ఉమెన్ వెల్ఫేర్ కమిటీ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి సుభాషిణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పిఠాపురం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్‌గా సేవలందిస్తున్న వి రమాదేవి విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 'ఆకాశంలో సగం-అవకాశాల్లో సగం' అన్న భావం కేవలం నినాదంగా మిగిలిపోకూడదని, ఆచరణలో జరగాలంటే అందుకు తగిన ముందుచూపు, ప్రణాళికతో సాధించాలని, కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయంలో అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్య అతిథి రిజిస్టర్ వి రమాదేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి విద్యార్థిని ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన, స్వయం నిర్ణయాధికారం తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఉమెన్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్, బాటనీ అధ్యాపకురాలు డా కె ఉష్శశ్రీ మాట్లాడుతూ ఈరోజుల్లో విద్యార్థినులు చదువు మాత్రమే కాకుండా స్వయం రక్షణ కోసం కరాటే వంటి విద్యలను కూడా అభ్యసించాలని సూచించారు. హ్యాండీ క్రాఫ్ట్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, షటిల్, టెన్నీకాయిట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీ రంగాన్ని పర్యాటక రంగంతో అనుసంధానించాలి

విశాలాంధ్ర - కడియం : కడియం నర్సరీ రైతులు విదేశీ మొక్కలు సాగు చేసే విధానాలు తెలుసుకునేందుకు విద్యార్థుల్లాగ, నూతన రకాల మొక్కలు సృష్టించే క్రమంలో శాస్త్రవేత్తల్లాగ ఉంటారు. కడియం మండలం కడియపులంక నర్సరీ అసోసియేషన్ మాజీ పాలకవర్గ సభ్యులు కొందరు మరియు నర్సరీ రైతులు మొక్కలపై మరింత అధ్యయనం చేసేందుకు వియత్నాం దేశం గత కొద్ది రోజుల క్రితం వెళ్లి, ఏడో తేదీ శుక్రవారం స్వదేశానికి తిరిగి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వియత్నాం దేశంలో అనేక నర్సరీలలో కొత్త రకాల మొక్కలను సందర్శించి, నూతన మొక్కల గురించి తెలుసుకున్నామన్నారు. మొక్కలు పెంపకంలోని పద్ధతులు, తెగుళ్లు నివారణ గురించి అక్కడ వారిని అడిగి తెలుసుకున్నామని తెలిపారు. నర్సరీ అసోసియేషన్ మాజీ సెక్రటరీ గాధ నాగేశ్వరావు మాట్లాడుతూ వియత్నం దేశంలో నర్సరీ రంగం అభివృద్ధి చెందడానికి శాస్త్ర సాంకేతికతతో పాటు పర్యాటక రంగం ఎంతో తోడ్పడుతుందన్నారు. బోటింగ్ ఉండటం వలన విదేశీ పర్యాటకులు ఎక్కువగా వస్తారని, దాని వలన బోట్ నడపటానికి, రెస్టారెంట్‌లుకు, రెస్టారెంట్‌లలో పనిచేయటానికి, పలు రకాలుగా వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. మన జిల్లాలో బోటింగ్ ఏర్పాట్లు చెయ్యడానికి చాలా ప్రదేశాలు ఉన్నాయని, అవి ఏర్పాటు చేస్తే ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కడియం నర్సరీలకు దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉన్నాయన్నారు. ఈ పర్యటనలో పెనుమాక కొండబాబు, తాడాల బాల మురళీకృష్ణ, బొరుసు సుబ్బారాయుడు, పెనుమాక ప్రవీణ్, మల్లు ప్రసాద్, పెద్దిరెడ్డి శేషారావు తదితర నర్సరీ రైతులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - కడియం : హిందువులు కలియుగ దైవమైన శ్రీనివాసుని ప్రతిరూపంగా భావించే ఆబోతును, కొందరు యువకులు హత్యచేసి, పూడ్చిపెట్టిన సంఘటన కడియం మండలం వీరవరం గ్రామంలో జరిగిన విషయం తెలిసిందే. స్థానిక హిందువులు కడియం పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు, సిఐ అల్లు వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన స్మశాన వాటికలో ఆబోతు శరీరాన్ని పూడ్చి పెట్టినట్లు గుర్తించారు. మండల స్థాయి అధికారులు కడియం తహసీల్దార్ సునీల్ కుమార్, కడియం సిఐ ఏ వెంకటేశ్వరరావు మరియు ఇద్దరు ప్రభుత్వ డాక్టర్ల సమక్షంలో పూడ్చిన ఆబోతును బయటికి తీసి, గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని అధికార యంత్రాంగం తెలిపారు. ఇదిలా ఉండగా మూగజీవాన్ని హింసాత్మకంగా హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, వీరవరం గ్రామ ప్రజలు గురువారం సాయంత్రం మౌన ప్రదర్శన, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిం చారు. ఇలాంటి దారుణాలకు ఇక తావు ఉండకూడదని, ప్రాణి ఏదైనా ప్రాణం విలువ గుర్తించాలని, ఈ సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలే సమాజానికి దిక్సూచి

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రస్తుత సమాజంలో కుటుంబాలకు మహిళల ఆధారమని, అన్ని రంగాల్లో వారు ఎదుగుతున్న తీరు అభినందనీయమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు సామర్లకోట పట్టణంలోని జిల్లా మహిళా సాధికార సంస్థ అయిన టిటిడిసిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. డిఆర్డిఏ పిడి ఎ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని పీడీ ఆధ్వర్యంలో ఆయా రంగాల్లో పనిచేస్తున్న 114 మంది మహిళలకు ఘన సత్కార కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న సమాజంలో పురుషుల కన్నా మహిళల పాత్ర అధికంగా ఉందన్నారు. పాటల పోటీలు, ముగ్గుల పోటీలు, తగ్గాఫోర్, స్పూన్అండ్ లెమన్, కుండలతో నీరు మోయడం, వంటి ఎనిమిది రకాల ఆటల పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంతో పాల్గొన్నారు. జిల్లా పరిధిలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఏడుగురు, ఎనిమిది మంది వివోఏలు, 24 మంది మహిళలు, 25 మంది మహిళా పారిశ్రామికవేత్తలు, 50 మంది మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేసి జ్ఞాపికలు, పూలమాలలు దుస్సాలు వాళ్ళతో సత్కరించారు. వేడుకల్లో భాగంగా జిల్లా పరిధిలో 558 మహిళా సంఘాలకు రు.100 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే చిన రాజప్ప, పిడి శ్రీనివాసరావులు మహిళా సంఘాలకు అందజేశారు.

పురుషులకు దీటుగా మహిళలు

విశాలాంధ్ర -దేవరపల్లి: ఆధునిక యుగంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ధీటుగా వ్యవహరించి పురుషులకు చేదోడు వాదోడుగా అన్ని రంగాలలో సహకారం అందిస్తున్నారు. వ్యవసాయ రంగం ప్రధాన వృత్తిగా గల కుటుంబాలలో మహిళలు పురుషులకు చేదోడువాదోడుగా సహకారాలు అందిస్తున్నారు. దేవరపల్లి గోపాలపురం నల్లజర్ల కొయిలగూడెం మండలాలలో రైతులు వర్జీనియా పొగాకు సాగు చేస్తూ ఉంటారు. పురుషులు పొగాకు పంటను నారుమడిదశ నుండి బ్యారెన్‌లో పొగాకును క్యూరింగ్ చేసే వరకు పురుషులు వ్యవసాయ పనులలో నిమగ్నం అవుతారు. క్యూరింగ్ చేసిన పొగాకును ఇంటి వద్దకు తీసుకువచ్చే వచ్చేవరకు పురుషుల పని అక్కడనుండి మహిళలే పొగాకును మండేలుగా వేసి దగ్గరుండి మహిళలతో గ్రేడింగ్ చేయించి బేళ్లు తొక్కేవరకు మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన గద్దె రమాదేవి భర్త వీరభద్రరావుకు చేదోడు వాదోడుగా ఉంటూ వ్యవసాయ పనులను శ్రద్ధతో దగ్గర ఉండి చేస్తున్నారు. గద్దె రమాదేవి ఎంతో ఉత్సాహంతో తోటి మహిళలతో పొగాకు గ్రేడింగ్ చేయిస్తూ ముఖ్యంగా గ్రేడింగ్‌లో వివిధ సూచనలు చేస్తూ వివిధ రకాల క్వాలిటీలను వేరు చేస్తూ గ్రేడింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా పొగాకు వ్యవసాయంలో తన భర్తకు సహకారం అందిస్తూ గృహిణిగా తన వంతు బాధ్యతలను నిర్వహిస్తు న్నానని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని తోటి మహిళలకు సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినం పురస్కరించుకొని తోటి మహిళలకు మహిళా దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు.

KAKINADA MUNICIPAL CORPORATION

'e' Procurement Notification

ROC. No.4169C/2024/E3, **Dt: 06-03-2025**

Tenders invited through ap e-procurement platform for **30** works with an estimated contract value of **Rs. 1,82,08,613/-** from the eligible contractors in the following manner.

Thirty Works for an amount of Rs. 1,82,08,613/-

Last date and time for downloading bid documents	: **Dt: 17-03-2025 upto 10-00 AM**
Last date and time for submission of bids	: **Dt: 17-03-2025 upto 10-30 AM**

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada.** Mail : kkd mplcorp@yahoo.com, Call Centre Phone : 0884-2357722.

Further Details can be seen at 'e' procurement market place@ www.apeprocurement.gov.in

Sd/- Bhawna, I.A.S.,
Commissioner
Municipal Corporation, Kakinada

తక్కువ ధరలో జనరిక్ మందులు : మంత్రి భూపతిరాజు

విశాలాంధ్ర -భీమవరం: సామాన్యులకు ఖరీదైన మందులను తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటుచేసి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్టిఫై చేసిన మందులు మాత్రమే జన్ ఔషధి కేంద్రాల ద్వారా అందించడం జరుగుతోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. జన ఔషధి దివస్ సందర్భంగా భీమవరం జేపీ రోడ్డులో ప్రధానమంత్రి జన్ ఔషధీ కేంద్రాన్ని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా కలెక్టర్ నాగరాణి శుక్రవారం సందర్శించారు. జనరిక్ షాపులో ఉన్న మందులను పరిశీలించి లబ్ధిదారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ తక్కువ ధరకే లభిస్తున్న జనరిక్ మందుల నాణ్యత పై ప్రజల్లో కొన్ని అపోహలు ఉన్నాయని, నాణ్యత విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించి తయారుచేసిన 2050 రకాల జనరిక్ మందులను మార్కెట్ ధర కంటే 50 నుండి 80 శాతం తక్కువ ధరకి జన్ ఔషధి షాపులో అందుబాటులో ఉన్నాయన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జనరిక్ మందులు ఎంతో ఉత్తమం అయినవని, ప్రజలు అపోహలు వీడాలన్నారు. వైద్యులు తప్పనిసరిగా జనరిక్ మందులను ప్రిస్క్రిప్షన్ రాసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి. భానునాయక్,జిల్లా డ్రగ్ కంట్రోలరు అధికారి షేక్ అభిత్ అలీ,జనరిక్ షాపు నిర్వాహకులు జి.చంద్రసుధీర్, జి.రాధ,మందులు కొనుక్కునే ప్రజలు,స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడుదాం : మావూరి

విశాలాంధ్ర ఏలూరు : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా ఆధ్వర్యంలో ఖండ్రికగూడెం,లక్ష్మీపురం శాఖలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మావూరి విజయ మాట్లాడుతూ సమాజంలో మహిళలు అనేక ఇబ్బందులను సమస్యలను ఎదుర్కొని నేటి సమాజంలో ఆధునిక మహిళగా అనేక విజయాలు సాధించడం వెనుక ఎన్నో పోరాటాలు జరిగాయని తెలిపారు.76 ఏళ్ల స్వాతంత్ర దేశంలో మనువాద అకృత్యాలైన సతీసహగమనం బాల్యవివాహాలు వంటి సామాజిక దురాచారాల నుండి బయటపడి నేడు సమాజంలో స్త్రీ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుటకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కుమ్మరి రేవు శాఖ కార్యదర్శి గొర్లి స్వాతి మాట్లాడుతూ మహిళలు అనేక పోరాటాలు ఉద్యమాల ద్వారా సాధించుకున్న అనేక చట్టాలను వినియోగించుకొని మహిళలు మరింత సాధికారతవైపు అడుగు వేయడానికి భవిష్యత్తులో జరిగే ఉద్యమాలలో మహిళలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం కేకు కోసి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బేబి సరోజినీ,సోఫి,ఆలివ్, ప్రియాంక,కొలిపాక అప్పల నరసమ్మ, దేవరకొండ నాగేశ్వరమ్మ,జ్యోతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు బెదిరింపులు..?

విశాలాంధ్ర - చాట్రాయి : చీపురుగూడెం లో 13 ఎకరాలు అటవీ భూమి ఆక్రమించుకొని ఆధునిక కోళ్ల ఫారం నిర్మించిన ఓ వ్యక్తి చాట్రాయి తహసీల్దార్ పై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామంలో 2023 సంవత్సరంలో మంకొల్లు ప్రధాన రహదారిలో అడవిలో ఆధునిక కోళ్లఫారాన్ని నిర్మించడంతో గ్రామానికి చెందిన కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఇనాటి నుంచి జరుగుతున్న విచారణలో అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు అనేక సందర్భాల్లో విచారణలు చేశారు. ఒక సందర్భంలో 23 శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. 1956 సంవత్సరం నుంచి ఉన్న విలేజ్ మ్యాపుల్లో గాని ఎఫ్ఎంబిలలో గాని ఎక్కడైనా సరే 645 /8 అనే సర్వే నెంబరు ఉన్న దాఖలాలు నేటికి దొరకని పరిస్థితి. కేవలం ఒక పాస్ బుక్కు తీసుకుని బ్యాంకులో మూడు కోట్ల రూపాయల రుణం తీసుకుని కోళ్ళఫారం నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల మూడు శాఖల అధికారులు కలిసికట్టుగా చేసిన సర్వేలో 645/8 అనే సర్వే నెంబర్ ఎక్కడ దొరకపోవడంతో అధికారులు భూమి రెవెన్యూ ది కాదని అటవీశాఖది అని నిర్ధారించినట్లు తెలుస్తోంది. ఈ విషయం బయటపడిన దగ్గర నుండి అటవీ భూమి ఆక్రమణ చేసిన వ్యక్తి చాట్రాయి తహసీల్దార్ ను బెదిరిస్తూ పై అధికారులకు కూడా కట్టుకథలు అల్లి అవినీతి ఆరోపణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై విశాలాంధ్ర తహసీల్దార్‌ను వివరణ కోరగా ఆమె మాట్లాడుతూ ఆ భూమికి ఏ విధమైన ఆధారాలు లేవని ప్రభుత్వ రికార్డులు అటవీ శాఖ రికార్డులలో అడవి భూమిగా ఉన్నట్లు అడవి శాఖ వారు చెప్తున్నారు. కోళ్ల ఫారం యజమాని ప్రణాళిక బద్ధంగా తనపై బెదిరింపులకు పాల్పడుతూ, బ్లాక్మెయిల్‌కు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రికార్డుల ఆధారంగానే తాము పై అధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. కోళ్ల ఫారంకు చెందిన వ్యక్తి గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు తనయుడు లోకేష్ తనకు తెలుసునని ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ జిల్లా పోలీసు ఉన్నతాధికారులను పైరవీ చేయడంతో అప్పట్లో 420 కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపిన పరిస్థితి ఏర్పడింది. అదే వ్యక్తి ప్రస్తుతం తనకు చంద్రబాబు, లోకేష్ తెలుసు అంటూ అధికారులను బెదిరిస్తున్నారని పలువురు అంటున్నారు.

జనసేనలోకి మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు

జనసేనలో చేరిన జిల్లా పరిషత్ వైస్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్, వైసీపీ కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు

విశాలాంధ్ర - కాకినాడ : పిఠాపురం వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు జనసేన పార్టీలో చేరారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షులు పవన్ కళ్యాణ్, పెండెం దొరబాబుకి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు పిఠాపురం నియోజక వర్గం వైసీపీ నేతలు పలువురు జనసేనలో చేరారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మ బుజ్జి, గొల్లప్రోలు మార్కెట్ కమిటీ చైర్మన్ మొగిలి వీర వెంకట సత్యనారాయణ, గొల్లప్రోలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపల్లి తిరుపతిరావు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, కౌన్సిలర్లు కవిడి పోసయ్య, బండి రవి, ఆర్ పావని, ఎం లోవరాజు, పిఠాపురం నియోజకవర్గానికి చెందిన సర్పంచులు నడిగట్ల చింతలరావు, కొత్తపల్లి లక్ష్మీరమణ బాబ్జీ, నెప్పల వరలక్ష్మి, కొత్తలూరి సునీత, మాదేపల్లి పార్వతీ, బండి రాణి, ఉమ్మడి మేరీ జాన్, మాజీ డీసీ చైర్మన్ తుమ్మల బాబు, వైసీపీ జిల్లా డాక్టర్స్ సెల్ విభాగానికి చెందిన డాక్టర్ పి రాజేష్, వైసీపీ పిఠాపురం టౌన్ ప్రెసిడెంట్ బొజ్జ దొరబాబులకు పవన్ కళ్యాణ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించగా, కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిఠాపురం నియోజకవర్గానికి చెందిన మరికొందరు వైసీపీ సర్పంచులు, నాయకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో మార్గదర్శకాలు పాటించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ మండలంలో రీ సర్వే, పిజి ఆర్ ఎస్ అర్జీలు పరిష్కారం పై శుక్రవారం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, సబ్ కలెక్టర్ అర్ కృష్ణ నాయక్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ చేపట్టడం తో, అర్జీలు పరిష్కార విధానంలో జవాబుదారీతనం ఖచ్చితంగా పాటించాలని కోరారు. పీజీఆర్ఎస్ ద్వారా రీ సర్వే కి చెందిన 924 అర్జీలను కోరుకొండ మండలం లో పరిష్కారం చేసినట్లు, వాటికీ అనుసంధానంగా రికార్డులు అందచేయాలని ఆదేశించారు. అర్జీలు పరిష్కారం చేసినా రీ ఓపెన్ అవుతున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో తహసిల్దార్ వి.సుస్వాగతం , ఇతర రెవెన్యూ మండల సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు అంతర్జాతీయ మహిళా దినోత్స కార్యక్రమం ఎంపీపీ చలగళ్ళ దొరబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, ప్రతి మహిళ అత్యున్నతమైన స్థానంలో ఉండాలని, మహిళలు ఉద్యోగ పాత్ర, కుటుంబ పాత్ర నిర్వహించుట జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. మహిళలు అందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకంక్షలు తెలిపారు. ఎంపీడీవో నాతి బుజ్జి మాట్లాడుతూ ప్రతి స్త్రీ అత్యుత్తమైన స్థాయికి ఎదగాలని, కుటుంబంలో ప్రధాన పాత్ర వహిస్తూ అందరి మన్ననల్ని పొందుతూ గొప్ప స్త్రీగా పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో కర్రి చంద్రరావు, ఈవోపిఆర్డి కట్ట చంద్రశేఖర్, ఐసిడిఎస్ సిడిపిఓ ఎమ్ పూర్ణిమ, ఏపీవో ఆర్ గంగాభవాని, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగపార్వతి, సర్పంచులు, ఎంపిటీసీలు, గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావసభ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - నిడదవోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు నిడదవోలు మంత్రి కార్యాలయంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు సంబంధించి రాజమండ్రి పార్లమెంట్ సమన్వయకర్త యర్రాగుల శ్రీనివాసరావు అధ్యక్షతన జనసేన పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 14న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ గ్రామంలో జరగబోవు జనసేన పార్టీ ఆవిర్భావ బహిరంగ సభకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళిక తదితర అవసరాల అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ 12వ వార్షికోత్సవ ఆవిర్భావ సభ పోస్టర్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు, జిల్లా సంయుక్త కార్యదర్శులు, మండల, పట్టణ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు, నిడదవోలు పట్టణ మున్సిపల్ చైర్మన్ భవతి ఆదినారాయణ మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ అధ్యక్షులు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.